కథానిక:

# హిందీ పరీక్ష

★

"కరుణకుమార"

చదువువిషయంలో ఆడవాళ్లకు ఇంత శ్రద్ధ వుంటుందని నే నెన్నడూ అనుకోలేదు.

మా ఆవిడ కాపురానికి వచ్చిన కొత్తల్లో నన్ను నాలుగు ఇంగ్లీషుముక్కలు చెప్పండీ అని వేధిస్తూ ఉండేది. కాని, 'సర్వ నాశాయ శోభనం' అని' ఇప్పుడు నేను చెప్పడం ఆమె నేర్చుకోవడం రెండూ నిజమేనని నేను చాచేసేవాణ్ణి. కాని ఆమెగారి పట్టుదలకొద్దీ ఒకసారి ఇంగ్లీషు ఆరంభించేవరకు, పదిహేను రోజులో మేము ఒకరితో ఒకరు జగడమాడుకొని ప్రళయకలహం కలిగినంతపని జరిగింది. డబ్బు ఖర్చుఅయితే అయింది. నెలజీతా లిచ్చి ఏ అయ్యవారిదగ్గరయినా గురుభావంతో చదువుకోవాలి గాని, ఇంటిదగ్గర పెనిమిటి చెప్పడం, భార్య చదువుకోవడ మేమిటి నా మొఖం అని ఆమె తననే తను పదితిట్టుకొని ఆ క్షణం లగాయతూ మళ్లా పాఠం చెప్పవలసిందని నన్ను అడిగిన పాపాన్నిపోలేదు సరిగదా, ఆ దెబ్బతో రెండుమూడు నెలలపాటు నాతో మాట్లాడడం మాని వేసింది మా ఆవిడ.

అట్లాంటిది—నాటికి నేడు. ఆ మధ్య నేం జరిగిందంటే—రాత్రి భోజనాలుచేసి కుర్చీలో కూర్చుని ఖులాసాగా తాంబూలం వేసుకొనే సమయంలో—

"ఏమండీ! మిమ్మల్ని ఒక్కటి అడుగుతాను. నా కోరిక తీరుస్తారా" అని అనేక రకం జాలిగా అడిగింది మా ఆవిడ.

అసలే మెత్తని మనస్సు నాది. అందులో పూవై, తన్మకరందమై, కరగిపో, బోనీళ్లకుంబల్చునై, పాదరసంవలె పరుగుపెట్టే మనస్సును అరికట్టే శక్తి లేని ఘడియలేమో అవి,

"నా శక్తికిమించని విషయమైతే నీ కోరిక తప్పక నెరవేరుస్తాను చెప్పు" అని నే ననడంతోటే, తములపాకు చిలక నోటికందిస్తూ.

"మనింట్లో కాపురం వున్న చిన్నమ్మని చూచారా" అని అడిగింది.

"చూడకేం?" అన్నాను.

"ఆవిడ హిందీ నేర్చుకొంటోందండీ" అన్నది.

"సంతోషం" అన్నాను.

"ఆయ నెవరో హిందీఅయ్యవారుట. కాంగ్రెసులోచేరి జైలుకి వెళ్లివచ్చాడట. నెలకి అయిదురూపాయలిస్తే ఇంటికివచ్చి రోజుకో గంటసేపు పాఠంచెప్పి పోతాడట."

"మహానుభావుడు"

"అదుగో! అట్లా ఎగతాళిగా మాట్లాడకండీ"

"మాట్లాడనులే."

"నన్ను కూడా చదువుకోమంటారా? మీరు చదువుకోమంటే చదువుకుంటాను. వద్దంటే మానివేస్తాను. నిజం చెప్పండి"

"ఇంతేకదా మహద్భాగ్యం. ఆవిడ కూడా తోడు ఉంటుంది. మహరాజులా ఇద్దరూ కలిసి చదువుకోండి," అని నే ననేవరకు ఆమె కొండెక్కినంత సంతోషం పొంది, ఆమెతో సమానంగా నన్ను వినువీధికి ఎగరెత్తుకొనిపోయింది.

## ౨

ఇట్టే ఆరంభించిన చదువు అట్టే ఆరు నెలలయిపోయింది. ఆ స్నేహితురాం డ్రిద్దరూ ఎప్పుడు చదువుకున్నారో, ఏయే పుస్తకాలు తెప్పించుకొన్నారో, నాకు తెలియకుండానే ప్రాథమిక పరీక్ష అని ఒక పరీక్ష జరగడం, ఆ పరీక్ష ప్యాసయినట్లు ఒకరోజు ఆంధ్రపత్రిక మా ఆవిడ తీసుకొనివచ్చి వాళ్ళిద్దరి నెంబర్లూ నాకు చూపడం, నేనది చూచి నోరు తెరచి కొయ్యనైపోవడం జరిగింది.

చదువు గమనంలో పరీక్ష నేది ఒక మెట్టు. అది ఒక మైలురాయి వంటిది. ఆ మెట్టెక్కి వెనక్కి తిరిగి

చూచుకుంటే, ఎంతదూరం ప్రయాణం చేసిందీ తెలుసుకోవచ్చు.

ప్రాథమిక పరీక్షలో ప్యాసయినట్టు పత్రికలో నెంబర్లు చూచుకొన్నది లగాయతూ, మహాప్రభో! ఆ యిద్దరి ఆడవాళ్ళ ఆగడం నే చెప్పలేను. ఇంగ్లీషులో బి. యే లు., ఎమ్. ఏ లు. ప్యాసయి కాన్వకేషనులో డిగ్రీలు పుచ్చుకున్న ఏ వనితారత్నానికీ కూడా అల్లాంటి వొళ్లువిరుపు లుండవు.

ఆ క్షణం లగాయతూ వాళ్లిద్దరూ హిందీభాషలో నే తప్ప తెలుగులో మాట్లాడడం మానేశారు. గుమ్మంలోకి కూరలమనిషి గాని, చాకలివాడు గాని రావడం భయం—దిక్కుమాలిన భాష మాట్లాడుతూ వాళ్ళమీద పడేవారు. చివరికి కాకినీ, పిల్లినీ కొట్ట వస్తే "చలో, జావ్" అంటూ బయల్దేరేవారు. ఒక రోజు పాలమనిషి పాలుపోస్తుంటే, "మూఁహ్ మే పానీ మిల్తా హై, కబడ్దార్" అని ఖస్సుమంటూ లేచింది మా ఆవిడ. ఆ పాలవాడు వెర్రిమొఖం వేసుకొని నా కేసిచూస్తే, నేను తెర్రమొఖం వేసుకొని వాడికేసి చూస్తూ నిలబడ్డాను.

అంతటితో పోనిచ్చేవారా! ఆ హిందీపండితురాండ్రిద్దరూ, తెలుగుభాషనీ, తెలుగుపుస్తకాలనీ తిట్టే తిట్లు నే వినలేకపోయేవాడిని. తెలుగుభాష వొట్టి చవట దద్దమ్మభాషట! ఇందులో రుచిలేదట! తెలుగులో చెప్పుకోతగ్గ కావ్యాలులేవట! తెలుగులో నాటకం అని చెప్పతగినది ఇప్పటికి బయల్దేర లేదట. ఇకముందు బయల్దేరుతుందన్న నమ్మకం లేదట! ఇక కథలూ నవలలూ సరేసరి. తెలుగువాళ్లు వెయ్యేళ్లు తల క్రిందుగా తపస్సుచేసినా హిందీకథలవంటి కథ ఒక్కటి కూడా వ్రాయలేరట సరిగదా - అసలు తెలుగులో కలంపుచ్చుకోతగ్గ అర్హత తెలుగుజాతికే లేదట!

ఈ దూషణా, ఈ తిరస్కారమూ, ఈ హైన్యమూ వింటుంటే నాకు వొళ్లు రవరవ మండిపోతుండేది.

"తెలుగుభాష నట్లా దూషించడం మీకు మంచిదిగాదు. హిందీభాషకు ఎంతమాత్రమూ తీసిపోదు, మీరు కాస్త తగ్గితే బాగుంటుందని" ఎప్పుడయినా నేను మనస్సులో బాధపట్టలేక వాళ్ల దగ్గర నోరు విప్పితినా,

"హిందీభాషలో "ఒ" కి ఎన్ని వంకరలున్నాయో తెలియని మీరు అట్టే మాట్లాడకండి" అని ఆ యిద్దరూ నామీద ఖస్సుమని లేచేవారు.

## 3

ఒకనాటి సాయంకాలం ఉన్నట్టుండి ఏమయిందా—మా ఆవిడ తలదువ్వి, జడవేసుకొని, కాళ్లకి స్లిప్పర్లు తొడిగి, చేతిలో ఏదో హిందీపుస్తకం పట్టుకొని, నా దగ్గరకువచ్చి,

"ఏమండీ! బొంబాయి టాకీసువారి బంధన్ వచ్చింది. మేం వెళ్లుతున్నాం మీరు వస్తారా?" అని బహు నిక్కచ్చిగా అడిగింది.

నేను రానన్నా వాళ్లు మానేటట్టు లేరు. అయినా బంధన్ చాలా గొప్ప చిత్రం అని అంటున్నారు. హిందీ వచ్చిన భార్యతో వెళ్లితే దగ్గర కూర్చోబెట్టుకొని ఆ సినీమా కాస్త చెప్పుతుందని ఆశపడి నేనూ బయల్దేరాను.

సినీమావాండ్లు ఆడవాళ్ల క్లాసులో మొగవాళ్లను పోనివ్వడానికి అటంకపరిచినా, మొగవాళ్లక్లాసులో ఆడవాళ్లని రానివ్వడానికి ఆక్షేపణ చెప్పరు కాబట్టి, నేనూ, మా ఆవిడా, ఆవిడ స్నేహితురాలు చిన్నమ్మా-ముగ్గురం మొగవాళ్లక్లాసులో వరసగా కూర్చున్నాం.

తెరమీద కథ గిర్రున తిరిగిపోతోంది. మా ఆవిడ నా అతీగతీ విచారించిన పాపాన్నిపోలేదు. మొగపీనుగనయి నేను మాత్రం ఏమని అడగను ఆవిడగారిని? తెరమీద కథ ఏమిటని నేను నోరుతెరుచుకొని అడగడాని కిష్టంలేక బిర్రబిగిసి అట్లనే కూర్చున్నాను.

ఇంతలో తెరమీద బొమ్మలు ఏమిటో మాట్లాడుకొన్నాయి. ఆ మాటలు విని హాల్లోవాళ్లందరూ ఒక్కసారిగా గొల్లుమని నవ్వారు. నేనూ నవ్వాను. కాని నా నవ్వుమీద ఆమెగారి కంత రోత ఎందుకు కలగాలీ? అంతమందిలోనూ,

"మీ రెందుకు నవ్వారో చెప్పండి" అని అడిగింది మా ఆవిడ.

ప్రక్కవాళ్లు వింటారేమో అని నాకు సిగ్గు.

నేను సమాధానం చెప్పలేదు.

"మిమ్మల్నే" అని మళ్లా అడిగింది.

నే పలకలేదు.

ఆమెకు ప్రాణం విసిగిందిగాబోలు—మళ్లా మాట్లాడలేదు. సినీమాఅయి యింటికి వచ్చాం. ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. ఆమె తీవ్రమైన మౌనం చూచి నా ప్రాణాలు పీచుపీచుమంటూనే ఉన్నవి.

ఆవిడగారు విడిచిపెట్టుతుందా ?

"సినీమాలో మీరు నవ్వేరు. మీ కేమి అర్థమయిందో చెప్తారా చెప్పరా" అని కూర్చుంది.

నాకూ ప్రాణం విసిగి,

"అందరూ నవ్వితే నేనూ నవ్వేను. తప్పా" అని ఉన్నదున్నట్లు చెప్పేశాను.

ఆవిడగా రేమనుకుందో,

"ఇదిగో చెప్పుతున్నాను వినండి. మీకు హిందీ భాష రాదంటే నేను నలుగురిలో తిరగలేకుండా వున్నాను. ఈ రోజు లగాయతూ మీకు రెండు నెలలు గడువు యిస్తున్నాను. అప్పటికి మీరు హిందీ చదివి, మాతోపాటు పెద్దపెద్ద గ్రంథాలు చదివి అర్థంచేసుకోలేకపోయినా, ఆఖరికి సినీమాలయినా అర్థంచేసుకోగలిగితేనే తప్ప, లేకపోతే ఇక మీకూ నాకూ ఇంతే" అని మొఖం చిట్లించుకొని నాపై ఒక ఆర్డినెన్సు ప్రయోగించినట్లు ప్రయోగించింది.

నా ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినవి. నలభయ్యేళ్లువచ్చి, మూతిమీద మీసంలో తెల్ల వెంట్రుకలు తేలిపోయే ఈడులో ఇప్పుడు నా విద్యాభ్యాసం ఏమిటి ? నావల్ల కాదు మహాప్రభో అని ఒక్క దణ్ణం పెట్టి ఊరుకున్నాను.

అది లగాయతూ ఆవిడ నాతో మాట్లాడడం మానేసి అన్నంత పంతమూ నెగ్గించుకొన్నది. తనకు నాతో ఏదయినా పని ఉంటే, చీటీమీద ఏవో హిందీ ముక్కలు వ్రాసి పిల్లవాడిచేత నాదగ్గరకు పంపేది. ఆ ముక్కలు నాకు అర్థంగాక బజారుకు తీసుకొనిపోతే,

"ఇంట్లో చింతపండు అయిపోయింది. తెప్పించండి తమరు," అని ఆ చీటిలో ఉండేది.

ఇక నాకు ఎట్లా ఉండాలి?

౪

దిక్కుమాలిన పరీక్షలు, ఆరేసి నెలలకే వస్తుంటాయి కాబోలు హిందీ పరీక్షలు. అదేదో మాధ్యమిక పరీక్షట—ఇంకొకటి వచ్చిపడింది. "ప్రాథమికం", "మాధ్యమికం", "సాహితీ",—ఏమిటి నా తల కాయా, ఈ పరీక్షలు! ఓ ఫస్టుఫారమా, శకండు ఫారమా, స్కూలుఫయినలా—ఆ పరీక్షల పేర్లు వింటేనే నాకు తలనొప్పి !

యథాప్రకారం అయ్యవారు ప్రతినిత్యమూ పాఠాలు చెప్పిపోతూనే వున్నారు. ఇంక నెలో, ఇరవైరోజులో ఉన్నది పరీక్ష; యింతలో ఆ అయ్యవారేం చేశాడంటే,

"అసలు పరీక్ష దగ్గరలోకి వస్తున్నది గదా, ఆ పరీక్షల్లో మీకు సులభంగా ఉండేటట్లు, ముందుగా నేను ఇంటిదగ్గర ఒక చిన్న పరీక్ష పెట్టుతాను. నేనిచ్చే ప్రశ్నలు మీరు పుస్తకాలు చూడకుండా, సరిగా టైం ప్రకారం వ్రాయగలిగితే, అసలు పరీక్షలో జంకు తీరి ధైర్యంగా వ్రాయవచ్చు. కాబట్టి నేను పెట్టే పరీక్షకు మీరు క్షుణ్ణంగా పాఠాలన్నీ చదవండి" అని చెప్పారు.

ఇక నెందుకు—కోతికి సారాయి పోసినట్లయింది, ఆ యిద్దరి విద్యార్థినుల వైఖరీని. ఒకరిమీద ఒకరు పంతాలు వేసుకొని చదవడంలో వాండ్లిద్దరూ చూపిన దీక్ష దీక్ష గాదు. 'వందేమాతరం'లో జానకి వంటజేస్తూ A-S-S—యాస్—గాడిద అని స్మరణ చేస్తుండే—సరిగా అట్లనే—వీండ్లిద్దరూ కూర్చున్నా, లేచినా, నడిచినా, ఏవో హిందీముక్కలు నోటిలో పరపర నములుతూనేఉండేవారు. ఒకళ్లు రాత్రి పన్నెండు గంటలదాకా చదివితే, ఇంకొకరు తెల్లవారుజామున లేచి కూర్చునేవారు.

ఒకరోజు రాత్రి నిద్ర రాకుండా ఆ రెండో ఆవిడ చిన్నమ్మ టీకాచుకొని తాగి తెల్లవార్లూ మేలుకొని చదవడం ఆరంభించిందట. ఆ సంగతి విని మా ఆవిడ, "అమ్మయ్యో! చిన్నమ్మ అసలు నిద్రమానేసింది. ఏం బుద్ధిరా భగవంతుడా" అని బెంగపెట్టుకొని పోయింది. తాను కూడా టీ తాగి మేలుకొందామనుకొంటే, తనవంటికి టీగాని, కాఫీగాని, బొత్తిగా సరిపడదు. వెనక ఒకసారి టీ తాగి నాటకం చూడడానికి వెళ్లితే తెల్లవారేసరికి ఒక్కుమ్మని వాంతులు పట్టుకొన్నాయి—యీవిడగారికి.

రాత్రి నేను అట్లా మంచంమీద పండుకొని నిద్రపోతున్నాను. ఆ పక్కగా ఆవిడగారి మంచం

నడుంగా మా అబ్బాయి పడుకున్నాను. రాత్రి పన్నెండయిందేమో—నాకూ ఒక కునుకుపట్టి మెలకువ వచ్చింది. కళ్లువిప్పి చూస్తునుగదా, మా ఆవిడ మంచానికి నడుంగా ఎక్కి కూర్చుని, రెండుచేతులతోను ముఖం కప్పుకొని, హు, హు, హు, అని వొణికిపోతోంది. ఆవిడగారి బాధఏమిటో నా కర్థంకాలేదు. అడుగుదామని నాలుక చివరిదాకా వచ్చిందిగాని—మన కెందుకు అనవసరపు గొడవ అని ఊరుకున్నాను. మా ఆవిడ బాధ ఏమిటో కళ్లుమూసుకొనే,

"ఠే! లడ్కా, లడ్కా! ఉఠ్, ఉఠ్" అని పిల్లవాణ్ణి గాబోలు లేపుతోంది.

వాడు పలకలేదు.

"ఠే లడ్కా. ఉఠో! పానీ లేలేవు, పానీ లేలేవు" అని మళ్ళా అనింది.

వాడికి మెళుకువ రాలేదు.

ఆమెకు ప్రాణం విసిగింది గాబోలు,

"ఒరే అబ్బాయి; నిన్నేరా. ఒక్కసారి లేచి ఇట్లా రా రా నాయనా. కూజాలో నీళ్లు కాసిని గ్లాసులో ఇవ్వరా. కళ్లు మండిపోతున్నవి" అని పెద్దంగా అరిచింది.

ఆ అరుపుకి వాడు నిద్రలేచి,

"ఏమిటే అమ్మా" అంటూ ఇన్ని నీళ్లు తీసికొని వెళ్లి యిచ్చాడు.

మొఖం కడుక్కొని, కళ్లు చికిలించి,

"అమ్మయ్య; దీన్ని తగలెయ్య; నిద్ర ఆపుకోలేక ఎరక్కబోయి పెట్టుకున్నాను. కళ్లల్లో కొంత గంధం. అబ్బా అగ్నిమంట లెత్తిపోయిందని" ఏమేమిటో గొణుక్కొంది. మనకు సంబంధించిన విషయం కాదని నేను కలుగచేసుకోలేదు.

వాండ్లిద్దరూ అంత దీక్షగా చదివారు ఆ పరీక్షకు.

*

ఆ రోజే కాబోలు పరీక్ష; నాకేం తెలుసు?

ఆఫీసులో తొందర పనివుండి, ఉదయాన్నే కాఫీ తీసికొని నా దారిన నేను ఆఫీసుకి వెళ్లిపోయాను. ఆ వెళ్లడం, వెళ్లడం, ఇంటికి రావడానికి ఒంటిగంటదాకా నాకు తీరికే కలగలేదు. నేను ఇంటికి వచ్చేవరకూ గదిలో మా ఆవిడా, ఆమెకు ఎదురుముఖంగా చిన్నమ్మా చాపమీద కూర్చుని, మోకాలుమీద అట్టలు పెట్టుకొని తెల్లకాగితాలమీద పరపర వ్రాస్తున్నారు. వాళ్లిద్దరికీ మధ్య ఒక బిగ్ బైంఫీసు టక్కు టక్కు మని కొట్టుకొంటోంది. చూస్తునుగదా ఒంటిగంట అయింది. గదిలో మూడో మనిషి - చిన్న పిల్లలయినా లేరు. వాతావరణం బహు తీవ్రంగా ఉన్నది. కోటూ ఉత్తరీయం తీసి, కాళ్లు కడుగుకొని, తీగా వంటయింటి గుమ్మందగ్గరకు వస్తునుగదా, ఆ గుమ్మానికి ఆనుకొని గోడమీద ఒక తెల్లటి అరటావు కాగితం గాలికి ఎగురుతోంది—దగ్గరకు వెళ్లిచూస్తే, దానిలో,

"మొగవాళ్లకు,

ఈ రోజే మాకు హిందీపరీక్ష. మీరు పది గంటలకే భోజనానికి వస్తారని చూచాను. కాని పన్నెండు గంటలయినా మీరు రాలేదు. మాకు 12 గంటలు లగాయతు 2 గంటలువరకూ పరీక్ష. అయ్యవారు 12 గంటలకే పేపరిచ్చి, రెండు గంటలకు మళ్లా వస్తారు, యీలోపల జవాబులు వ్రాయండని చెప్పి వెళ్లిపోయాడు. మేము కాపీ చేయకుండా మా పుస్తకాలు కూడా ఆయనే తీసుకొనిపోయాడు; రెండు గంటలవరకూ మేము పరీక్షలో మునిగిపోయి ఉంటాము. కాబట్టి మీరు ఇంటికి వచ్చిన తర్వాత మమ్మలిని పలకరించి మా సమాధిని చెడగొట్టడానికి వీల్లేదు. మీకు వంటింట్లో పీట వేసి, ఆకు వేసి, అన్నం, కూరా, పప్పూ—సమస్తమూ అమిర్చిపెట్టి ఉంచాను. మీరు చడీచప్పుడు లేకుండా అన్నం తిని వెళ్లిపోవలసింది. మీ రాకవల్ల మా ఏకాగ్రతకు భంగం కలిగి మా పరీక్ష చెడిపోయినట్టయితే ఆ తర్వాత ఆడవాళ్ళ విద్యని మొగవాళ్లు ఆధిక్షేపిస్తే మాట దక్కదు. కాబట్టి భద్రం—

ఇట్లు మీ ఆవిడ."

అని చదువుకొందునుగదా నాకు ఊపిరి స్తంభించిపోయింది. ముక్కూ, నోరూ మూసుకొని మునగాళ్ళమీదనే చల్లగా వంటింట్లోకి వెళ్ళి విస్తరిముందుకూర్చుని అన్నం వడ్డించుకొన్నాను. నేను కూర్చున్న చోటినుండి చూస్తే గదిలో వాళ్లు నాకు అగపడుతున్నారు. కాని నేనుమాత్రం వాళ్లకు కొంత ప్రయత్నంమీదగాని అగుపడను.

బిగ్ బెన్ గడియారంలో ఒంటిగంటన్నరయింది. ఇంక అరగంటకి వాళ్ల పేపరు టైం అయిపోతుంది. అయ్యవారు అప్పటికి వచ్చేస్తాడు. అదివరదాకా చరచరా వ్రాసేవాళ్లిద్దరికలాలూ మందగించి నిలిచిపోయినవి.

ఇద్దరూ గడియారంలో ఒకరి మొఖం వకరు చూచుకున్నారు.

చిన్నమ్మ మా ఆవిడని,

"అత్తయ్యా;" అని పలకరించింది.

"ఏమమ్మా!" అంది మా ఆవిడ.

"మీరు అన్ని ప్రశ్నలూ వ్రాశారా?" అంది చిన్నమ్మ.

"నీవో?" అంది మా ఆవిడ.

"లేదత్తయ్యా! ఇంకా నాలుగు ప్రశ్నలు వ్రాయాలీ" అంది చిన్నమ్మ.

"నేనూ వ్రాయాలమ్మా మూడు ప్రశ్నలు" అంది మా ఆవిడ.

"టైం ఇంక అరగంటకంటె ఎక్కువ లేదు. ఎట్లా అత్తయ్యా?" అంది చిన్నమ్మ.

"ఏమోనమ్మా నాకేమీ తోచడంలేదు" అంది మా ఆవిడ.

"ఒకపని చేద్దాం" అంది చిన్నమ్మ.

"ఏమిటది?"

"గడియారం ఒక అరగంట వెనక్కి తిప్పేద్దాం."

"తిప్పితే?"

"అరగంట వెనక్కి తిప్పితే మనకి ఒక గంట టైం ఉంటుంది. ప్రశ్నలన్నీ వ్రాయవచ్చు."

"సరే కానియ్యి" అంది మా ఆవిడ.

గడియారం చేతికి తీసికొని మర కిరకిర తిప్పింది చిన్నమ్మ.

గణగణ మోగడం మొదలు పెట్టింది గడియారం. ఎవరన్నా విని అక్కడకు వస్తారని భయమో ఏమో, "మంచిపని చేశావమ్మా అలారం తిప్పేవేమిటమ్మా" అని మా ఆవిడ గడియారం నెత్తిమీద టక్కున కొట్టింది. గడియారం నోరు కట్టింది.

ఇద్దరూ సాధించి అరగంట వెనక్కి తిప్పేశారు.

ఇంతకుపూర్వం ఒంటిగంటన్నర చూపిన గడియారం ఇప్పుడు ఒంటిగంటే చూపుతోంది.

మళ్లా వ్రాయడం ఆరంభించారు. నేను వంటింట్లో నే తిష్ఠ వేసి కూర్చున్నాను. బిగ్ బెన్‌లో ఒంటిగంటన్నరయింది. అయ్యవారు చక్కా వచ్చాడు.

"రెండుగంట లయిపోయింది ఇంకా వ్రాస్తున్నారేమిటని" అడిగాడు అయ్యవారు.

"ఇంకా అరగంట టైం ఉన్నది. ఒంటిగంటన్నరే కదండి అయింది." అని వాళ్లిద్దరూ బిగ్ బెన్ చూపించారు.

తన చేతి రిస్టువాచీ చూచుకున్నాడు—అయ్యవారు.

"అరగంట తేడా ఉన్నదే ఎందుకల్లి?" అని అడిగాడు.

"మీ వాచీ ఫాస్టుగా పోతోంది కాబోలు" నన్నారు శిష్యురాండ్రు.

"టైంపీసు స్లోగా వెళ్ళుతోందా ఏమిటి" న్నాడు అయ్యవారు.

రిస్టువాచీ ఫాస్టు అని శిష్యురాండ్రూ, టైంపీసు స్లో అని అయ్యవారూను.

మంచినీళ్లు తాగడంలో నాకు గొంతుక కొరబోయి రవంత దగ్గేటప్పటికి-మా ఆవిడకు నా స్ఫురణ తెలిసింది కాబోలు-నావైపు తిరిగి గుడ్లెర్ర జేసింది. నేను కిక్కురుమనకుండా లేచి చక్కా పోయాను.

తన రిస్టువాచీ టైంపీసుప్రకారం సరిచేసుకొని, అరగంటసేపూ కాచుకొని, పరీక్షకాగితాలు తీసుకొని చక్కా పోయాడు—అయ్యవారు.